జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

ఆదివారం
18-10-2026

సంపుటి 1 | సంచిక 326

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195



దుర్గాపూజ మండపంలో అపశ్రుతి..

17 మంది మృతి!

4లో



పంతంగి టోల్ ప్లాజా వద్ద
వాహనాల బారులు

దసరా, బతుకమ్మ పండుగల వేళ హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ జామ్

లక్కారం-వలిగొండ మీదుగా చిట్యాలకు వాహనాల మళ్లింపు

దశ, చౌటుప్పల్ : దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో జాతీయ రహదారి 65పై వాహనాల రద్దీ పెరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద విజయవాడ వైపు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చౌటుప్పల్ పరిధిలో ఫ్లైఓవర్ల నిర్మాణ పనుల కారణంగా సర్వీసు రోడ్డుపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఫాస్టాగ్ బ్యాలెన్స్ లేకపోవడం, సాంకేతిక సమస్యలు కూడా టోల్ ప్లాజా వద్ద రద్దీకి కారణమవుతున్నాయని అధికారులు తెలిపారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు పోలీసులు ప్రత్యామ్నాయ


..మిగతా 4వ పేజీలో ➔



ఏపీలో లేని క్రాప్ హాలిడే
తెలంగాణలో ఎందుకు?

దశ, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో లేని క్రాప్ హాలిడే తెలంగాణలో ఎందుకు వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. నీటి కొరతపై ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రపంచంలో ఏదైనా కొనగలమని, కానీ నీటిని కొనలేమని సీఎం చెబుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. అలాంటప్పుడు నీటిని ఒడిసిపట్టేందుకు ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. నీటిని ఏపీకి తరలించేందుకు అనుమతించి, ఇప్పుడు పరిస్థితి చేయి దాటిన తర్వాత చర్యలు తీసుకుంటే ఎలా అని నిలదీశారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కూడా హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మద్దతు ఇస్తోందని ఆరోపించారు. ఈ నెల 7న చంద్రబాబు కేంద్రానికి లేఖ

..మిగతా 4వ పేజీలో ➔



యువకుల రేసింగ్ సరదా..
మహిళ దుర్మరణం!

దశ, మహబూబ్‌నగర్: రెండు థార్ కార్లతో రేసింగ్ చేస్తూ యువకులు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా, ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషాద ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ యూపీఎస్ పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న షహానా బేగం (40) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త షాకీర్‌కు కాళ్లు, చేతులు విరగడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. తల్లి ఒడిలో ఉన్న చిన్నారి ఆయారా స్వల్ప గాయాలతో బయటపడింది. ప్రమాదానికి కారణమైన రెండు కార్లలో ఒకటి అక్కడి నుంచి వెళ్లిపోగా, మరో కారును స్థానికులు వెంబడించి పట్టుకున్నట్లు తెలిసింది.

దసరాకు హైడ్రా పోలీస్ స్టేషన్!



చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్రిమినల్ కేసులు

క్యూర్ చట్టంతో పెరగనున్న హైడ్రా అధికారాలు.. త్వరలో మార్గదర్శకాలు



దశ, హైదరాబాద్: నగర పరిధిలోని చెరువులు, సరస్సులు, రహదారులు, పార్కులు, లేఅవుట్లలోని ఖాళీ స్థలాల ఆక్రమణలపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు హైడ్రా ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతోంది. ఇటీవల అమల్లోకి వచ్చిన క్యూర్ చట్టం ద్వారా హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు, అధికారాలకు సంబంధించి స్పష్టత వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దసరా పండుగకు ముందు లేదా అనంతరం పోలీస్ స్టేషన్ కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. హైడ్రా, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల అధికారులకు చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హైడ్రా పరిధి, క్యూర్ చట్టం కల్పించిన అధికారాలు,వాటి వినియోగం,కేసుల నమోదు విధానంపై అధికారులకు వివరించనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. క్యూర్ చట్టంలోని 28వ అధ్యాయం, సెక్షన్ 241(3) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం, వారిపై దాడికి పాల్పడటం, జలాశయాలను కలుషితం చేయడం వంటి చర్యలపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేయాలా? లేక హైడ్రా కమిషనర్ సిఫార్సుతో ముందుకు వెళ్లాలా? అనే అంశాలపై ప్రభుత్వ మార్గదర్శకాలు కీలకం కానున్నాయి. ఈ కేసుల విచారణ నాంపల్లిలోని తొమ్మిదో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు అందించే ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా చర్యలు తీసుకుంటుందని కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో 50కి పైగా కేసులు విచారణలో ఉన్నాయని, ప్రత్యేక పోలీస్ స్టేషన్ అందుబాటులోకి వస్తే ఆయా కేసులను హైడ్రాకు బదిలీ చేసే అవకాశం ఉందని గతంలో వివరించారు.కొత్త పోలీస్ స్టేషన్ ద్వారా కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ వేగవంతం కానుందని పేర్కొన్నారు. మరోవైపు కాప్రా చెరువు పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని హైడ్రా వెల్లడించింది. సుమారు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు చెరువును పక్షులకు అనుకూలమైన

..మిగతా 4వ పేజీలో ➔



కీసర సీఐపై మరో ఏసీబీ కేసు

లంచం కేసులో పట్టుబడిన ఆంజనేయులుపై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు

దశ, హైదరాబాద్: లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన కీసర సీఐ అరకపల్లి ఆంజనేయులుపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో మరో కేసు నమోదైంది. శనివారం ఆయన నివాసంతో పాటు కుటుంబ సభ్యులకు చెందిన నాలుగు ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి

..మిగతా 4వ పేజీలో ➔

అమెరికాలో భార్యను హత్య చేసి..
పారిపోతూ పట్టుబడ్డ భర్త



దశ, అంతర్జాతీయం : అమెరికాలో ప్రవాస భారతీయుడు తన భార్యను కత్తితో పొడిచి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అనంతరం భారత్‌కు పారిపోయేందుకు ప్రయత్నించగా, విమానం ఎక్కకముందే పోలీసులకు చిక్కాడు. షికాగోలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భారత సంతతికి చెందిన అంకుర్ పటేల్ (31), అతని భార్య కొంతకాలంగా షికాగోలో నివసిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. దంపతుల మధ్య విభేదాలు రావడంతో గత మే నెల నుంచి విడివిడిగా ఉంటున్నారు. అనంతరం భార్య లూసియానాలో తన మాజీ సహోద్యోగితో కలిసి ఉంటున్నట్లు సమాచారం. కుమార్తె మాత్రం అంకుర్ వద్దే ఉండేది. భార్య తిరిగి తనతో కలిసి జీవించేందుకు నిరాకరించడంతో అంకుర్ ఆమెను, ఆమె కొత్త భాగస్వామిని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కుమార్తెను భారత్‌లోని తన తల్లిదండ్రుల వద్దకు పంపించిన అనంతరం, చిన్నారిని చూపిస్తానని చెప్పి భార్యను షికాగోలోని తన అపార్ట్‌మెంట్‌కు రప్పించినట్లు

..మిగతా 4వ పేజీలో ➔

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో
దసరా నుంచి ఓపీ సేవలు!

రూ.1,150 కోట్లతో నిర్మాణం.. 2,208 పడకల సామర్థ్యం

తొలుత రెండు అంతస్తుల్లో 22 విభాగాలు ప్రారంభం



దశ, వరంగల్: వరంగల్‌లో నిర్మిస్తున్న ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో దసరా పండుగ సందర్భంగా ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన ఎంజీఎం ఆస్పత్రి భవనం నుంచి వైద్య సేవలను కొత్త భవనంలోకి తరలించడంపై దృష్టి సారించింది. తొలుత రెండు అంతస్తుల్లో 22 వైద్య విభాగాలకు సంబంధించిన ఓపీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నవంబర్ చివరి నాటికి లేదా డిసెంబర్‌లో పూర్తిస్థాయి వైద్య సేవలు ప్రారంభించేలా

..మిగతా 4వ పేజీలో ➔

బీఆర్ఎస్ ఆస్తులు రూ.1,509 కోట్లు!



రూ.114 కోట్ల ఆదాయం.. రూ.162 కోట్ల ఖర్చు.. రూ.48.43 కోట్ల లోటు

దశ, హైదరాబాద్: తెలంగాణలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఆర్థిక వివరాలు ఆసక్తికరంగా మారాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన ఆడిట్ నివేదిక ప్రకారం, 2026 మార్చి 31 నాటికి పార్టీ మొత్తం ఆస్తులు రూ.1,509 కోట్లుగా నమోదయ్యాయి. అయితే, అదే ఏడాది ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా ఉండటం గమనార్హం.పార్టీ ఆస్తుల్లో అత్యధికంగా రూ.1,431 కోట్లు బ్యాంకు నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. వీటిలో రూ.1,237 కోట్లు ఏడాదికి మించిన కాలపరిమితి కలిగిన దీర్ఘకాలిక డిపాజిట్లు. భవనాలు, ఇతర భౌతిక ఆస్తుల

..మిగతా 4వ పేజీలో ➔

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో

దసరా నుంచి ఓపీ సేవలు!

మొదటి పేజీ తరువాయి

చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం మంత్రి సీతక్కతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. ఓపీ సేవల ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లి ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో 56 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.1,150 కోట్ల వ్యయంతో 2021లో ఈ ఆస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 24 అంతస్తులతో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రిలో దశలవారీగా మొత్తం 2,208 పడకల సామర్థ్యంతో వైద్య సేవలు అందించనున్నారు. వైద్య సేవల కోసం తొమ్మిది అంతస్తులను



వినియోగించేందుకు ప్రణాళిక రూపొందించగా, ప్రస్తుతం ఆరు అంతస్తుల్లో పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన అంతస్తుల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్త భవనంలోకి విభాగాలను తరలించాల్సిన అవసరం ఏర్పడింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే మొత్తం 37 వైద్య విభాగాల ద్వారా సేవలు అందనున్నాయి. సంతానలేమి చికిత్స, అవయవదానం, అవయవ మార్పిడి వంటి ప్రత్యేక వైద్య సేవలకు సంబంధించిన విభాగాలను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ పర్యటనలో ఎంపీ బలరాం నాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కుడా చైర్‌పర్సన్ సుధారాణి, కలెక్టర్లు సత్యశారద, చాహత్ బాజ్‌పాయ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆస్తులు

రూ.1,509 కోట్లు!

మొదటి పేజీ తరువాయి

విలువ రూ.66.26 కోట్లు కాగా, రుణాలు, అడ్వాన్సుల రూపంలో మరో రూ.11.77 కోట్లు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. 2025-26లో బీఆర్ఎస్‌కు మొత్తం రూ.114 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో విరాళాల ద్వారా రూ.16.44 కోట్లు రాగా, డిపాజిట్లపై వడ్డీ, అద్దెలు, ఇతర మార్గాల ద్వారా రూ.97.76 కోట్లు వచ్చినట్లు నివేదికలో వెల్లడైంది. అదే సమయంలో పార్టీ మొత్తం వ్యయం రూ.162 కోట్లుగా నమోదైంది. దీంతో ఆదాయం కంటే రూ.48.43 కోట్ల మేర ఖర్చు అధికమైంది. ఈ నేపథ్యంలో పార్టీ జనరల్ ఫండ్ రూ.1,551 కోట్ల నుంచి రూ.1,503 కోట్లకు తగ్గింది. పార్టీ ఖర్చుల్లో ప్రచార కార్యక్రమాలకే అధిక మొత్తాన్ని వెచ్చించారు. సాధారణ ప్రచార కార్యకలాపాల కోసం రూ.137 కోట్లు ఖర్చు చేయగా, బహిరంగ సభల నిర్వహణకు రూ.57.51 కోట్లు, పత్రికలు, టెలివిజన్ ప్రకటనలకు రూ.53.68 కోట్లు వెచ్చించారు. పరిపాలన, ఇతర సాధారణ ఖర్చుల కింద రూ.16.88 కోట్లు ఖర్చు కాగా, న్యాయ సేవల కోసం రూ.13.39 కోట్లు వెచ్చించినట్లు నివేదిక తెలిపింది. గతేడాది నవంబర్‌లో జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం ప్రత్యేకంగా రూ.1.60 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది. మొత్తంగా బీఆర్ఎస్ వద్ద భారీగా ఆస్తులు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నప్పటికీ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆదాయాన్ని మించి వ్యయం నమోదవడం ఆడిట్ నివేదికలో ప్రధాన అంశంగా నిలిచింది.

దసరాకు

హైడ్రా పోలీస్ స్టేషన్!

మొదటి పేజీ తరువాయి

ఆవాసంగా తీర్చిదిద్దాయని తెలిపింది. ఈ ప్రాంతంలో 450 రకాల వలస పక్షులకు ఆవాసం ఏర్పడినట్లు పేర్కొంది. ఇప్పటికే వందల ఎకరాల ప్రభుత్వ భూములతో పాటు పలు చెరువులు, పార్కులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడినట్లు కమిషనర్ రంగనాథ్ తెలిపారు. చెరువుల ఆక్రమణలకు మూలకారణాలను గుర్తించి అడ్డుకోవడం, నకిలీ పత్రాలతో ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించే వారిపై ఆధారాలతో చట్టపరమైన చర్యలు తీసుకోవడం హైడ్రా లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ చర్యలు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉంది.

కీసర సీఐపై మరో ఏసీబీ కేసు

మొదటి పేజీ తరువాయి

కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో పలు ఇళ్లతో పాటు నల్గొండ జిల్లా మిర్యాలగూడ, హాలియా ప్రాంతంలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. నగదు, బంగారం, వాహనాలు, గృహోపకరణాలు సహా అధికారిక లెక్కల ప్రకారం మొత్తం రూ.2.28 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. వీటి వాస్తవ మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత నెల 17న పోలీస్ స్టేషన్‌లో రూ.5 లక్షల లంచం తీసుకుంటుండగా అంజనేయులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తాజాగా ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలోనూ కేసు నమోదు చేయడంతో పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సోదాల్లో లభించిన పత్రాలు, ఆస్తుల వివరాల ఆధారంగా ఏసీబీ అధికారులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఏపీలో లేని క్రాప్ హాలిడే తెలంగాణలో ఎందుకు?

మొదటి పేజీ తరువాయి



రాయగా, 13వ తేదీన ఆ అంశాన్ని అజెండాలో చేర్చి, నవంబర్ 3న సమావేశం నిర్వహించాలని నిర్ణయించారనిపేర్కొన్నారు.పోలవరంనుంచినదుల అనుసంధానం చేపడితే బొల్లేపల్లి రిజర్వాయర్‌ను నింపుకోవచ్చని ఏపీ ప్రతిపాదించిందని, దీనివల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ నుంచి నదుల అనుసంధానం చేపట్టాలనే ప్రతిపాదనకు కేంద్రంతో పాటు గోదావరి పరివాహక రాష్ట్రాలు అంగీకరించాయని హరీశ్‌రావు గుర్తుచేశారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.



అమెరికాలో భార్యను హత్య చేసి.. పారిపోతూ పట్టుబడ్డ భర్త

మొదటి పేజీ తరువాయి

దర్యాప్తులో వెల్లడైంది. అక్కడ ఆమెతో వాగ్వాదం జరగడంతో కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. భార్య ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఆమె భాగస్వామి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మరోవైపు, అంకుర్ స్నేహితులు అపార్ట్‌మెంట్‌కు వెళ్లగా అక్కడ ఆమె మృతదేహాన్ని గుర్తించినట్లు సమాచారం. పోస్టుమార్టంలో ఆమె శరీరంపై పలు గాయాలు ఉన్నట్లు వెల్లడైంది. హత్య అనంతరం అంకుర్ షికాగో ఓ'హేర్ విమానాశ్రయానికి వెళ్లి భారత్‌కు వెళ్లేందుకు ప్రయత్నించాడు. మొదట టికెట్ కొనుగోలు చేయలేక సమీపంలోని హోటల్‌లో బస చేసి, మరుసటి రోజు టికెట్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అప్పటికే అప్రమత్తమైన పోలీసులు అతడిని విమానం ఎక్కకముందే అరెస్టు చేశారు. ఈ కేసులో అంకుర్ పటేల్‌పై ఫస్ట్ డిగ్రీ హత్య అభియోగం నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల బారులు

మొదటి పేజీ తరువాయి

మార్గాల్లో వాహనాలను మళ్లిస్తున్నారు. చౌటుప్పల్ పరిధిలోని లక్కారం నుంచి వలిగొండ మీదుగా చిట్యాలకు చేరుకునేలా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. పండుగల నేపథ్యంలో రహదారులపై రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో ప్రయాణికులు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.



సెక్షన్ 22-ఏ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సాఫ్ట్‌వేర్ మోక్షం!

నిషేధిత జాబితాలోని అర్హమైన ఆస్తులకు ఊరట దిశగా ప్రభుత్వం అడుగులు



దశ, హైదరాబాద్: తెలంగాణలో సెక్షన్ 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన అర్హమైన ప్లాట్ల యజమానులకు ఊరట కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. అనుమతులు, ఆమోదిత లేఅవుట్లు ఉన్నప్పటికీ రికార్డుల్లోని సమస్యల కారణంగా క్రయవిక్రయాలు జరగక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి పరిష్కారం చూపేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది ప్రభుత్వ భూములు, వివాదాస్పద స్థలాలు, ఇనాం భూములకు సంబంధించిన వివిధ కారణాలతో కొన్ని ఆస్తులు సెక్షన్ 22ఏ జాబితాలో చేరినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో చట్టబద్ధమైన ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరు యజమానులు వాటిని విక్రయించలేక, బ్యాంకు రుణాలు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అర్హత కలిగిన ఆస్తులను గుర్తించి, నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను సులభతరం చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ప్రతిపాదిత సాఫ్ట్‌వేర్ ద్వారా సంబంధిత ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆమోదిత లేఅవుట్ అనుమతులు, రెవెన్యూ రికార్డులను డిజిటల్ విధానంలో పరిశీలించే అవకాశం ఉంది. పత్రాలు, భూమి వివరాలు, చట్టపరమైన అర్హతలను నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకునేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విధానం అమల్లోకి వస్తే నిషేధిత జాబితాలో చిక్కుకున్న అర్హమైన ఆస్తుల సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఏర్పడుతుంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో జాప్యం తగ్గడంతో పాటు ఆస్తుల యజమానులకు ఉపశమనం కలగవచ్చు. రియల్ ఎస్టేట్ లావాదేవీలకు ఊతం లభించడంతో ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగే అవకాశమూ ఉంటుంది. అయితే, సాఫ్ట్‌వేర్ అమలుకు సంబంధించిన అధికారిక ప్రకటన, మార్గదర్శకాలు, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం వెల్లడైన తర్వాతే ఈ ప్రక్రియపై పూర్తి స్పష్టత రానుంది. సెక్షన్ 22ఏ జాబితాలో ఉన్న ప్రతి ఆస్తికీ ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ అనుమతి లభించదు. సంబంధిత చట్టాలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత నిర్ధారణ తప్పనిసరి.



షార్లెట్‌లో తెలుగు సంబురాలు..

మిషిగన్‌లో నాట్స్ చాప్టర్ ప్రారంభం

దశ, అంతర్జాతీయం : అమెరికాలోని షార్లెట్‌లో నిర్వహించిన 'షార్లెట్ తెలుగు సంబరాలు-2026' వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు, యువత ప్రదర్శించిన శాస్త్రీయ సంగీతం, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తొమ్మిది శాస్త్రీయ అంశాలతో నిర్వహించిన సైన్స్ ఫెస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తానా, జీటీఏ, ఆప్తా తదితర తెలుగు సంస్థలు భాగస్వాములయ్యాయి. నాట్స్ అధ్యక్షుడు రాజ్ అల్లాడా హాజరయ్యారు. ఈ సందర్భంగా 800 కొత్త రిజిస్ట్రేషన్లు నమోదైనట్లు నిర్వాహకులు తెలిపారు. మరోవైపు, తెలుగు సంస్కృతి పరిరక్షణ, సామాజిక సేవల విస్తరణ లక్ష్యంగా నార్త్ అమెరికన్ తెలుగు సొసైటీ (నాట్స్) మిషిగన్ చాప్టర్‌ను ఫార్మింగ్టన్ హిల్స్‌లో ప్రారంభించారు. చాప్టర్ కోఆర్డినేటర్‌గా శ్రీదేవి మణేపల్లి, జాయింట్ కోఆర్డినేటర్‌గా మహి బొల్లవరం నియమితులయ్యారు. రవి చాలంటి, హేమ సూరపరాజు, జ్యోతి జవ్వాది, అనుపమ దివాకర్లకు వివిధ బాధ్యతలు అప్పగించారు. నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల, అధ్యక్షుడు రాజ్ అల్లాడా మాట్లాడుతూ తెలుగు సమాజానికి సేవలందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా మనోరమ గాంధీ, సంధ్య శ్రీ ఆత్మకూరి, మనబడి, సన్నీ రెడ్డి, డాక్టర్ హరినాథ్ పోలిచెర్లను సత్కరించారు. విద్యార్థుల కూచిపూడి ప్రదర్శనలు అలరించాయి. మహిళా సాధికారత, యువ నాయకత్వం, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు ప్రతి మూడు నెలలకు ఒక ప్రధాన సేవా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ తెలుగు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పీఆర్వో జీకే మీడియా గణేష్ కుమార్..



దుర్గాపూజ మండపంలో అపశ్రుతి.. 17 మంది మృతి!

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో సామూహిక దుర్గాపూజలో అపశ్రుతి చోటుచేసుకుంది. మండపం వద్ద జనం ఒక్కసారిగా ఎగబడటంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో 17 మంది మృతి చెందినట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఘటనలో మరో 25 మంది గాయపడ్డారు. బాధితుల్లో ఎక్కువగా మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది. నగరంలోని చోర్‌బగాన్ దుర్గాపూజ మండపం బయట వేచి ఉన్న జనం ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లారు. వర్షం కురుస్తున్న సమయంలో తోపులాట జరిగిందని, కొందరు రోడ్డుపై పడిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సీఎం సువేందు అధికారి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై మాజీ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

17 మంది మృతి.. బాధాకరం: మోదీ

కోల్‌కతా తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. దుర్గామాత మండపం తొక్కిసలాటలో 17 మంది మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు.

అమిత్ షా పర్యటన వాయిదా..

కోల్‌కతా తొక్కిసలాట ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనపై బెంగాల్ సీఎం సువేందు అధికారితో మాట్లాడారు. ఈ ఘటన నేపథ్యంలో ఆదివారం బెంగాల్‌లో జరగాల్సిన అమిత్ షా పర్యటన వాయిదా పడింది. క్షతగాత్రులను పరామర్శించేందుకు ఆయన ఆసుపత్రికి వెళ్లనున్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com